

ముస్తాబైన 'ఆది దేవుడు'

ఈనెల 18న వినాయక చవితి నవరాత్రులు ప్రారంభం కానుండగా, ఇప్పటికే విగ్రహాల విక్రయాలు మొదలయ్యాయి. 8లో



తాళం పగులగొట్టి..

అంగన్‌వాడీలు సమ్మె చేస్తుండడంతో అధికారులు కేంద్రాల తాళాలు పగులగొట్టి చిన్నారులకు సరుకులు సరఫరా చేశారు. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

రామయ్యను దర్శించుకున్న ఐపీఎస్ అధికారి

శ్రీసీతారామ చంద్రస్వామి వారిని జార్ఖండ్‌లోని సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు చెందిన ఐపీఎస్ అధికారి విధికుమార్‌బిర్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూల మూర్తులు, ఉపాలయాలను దర్శించుకున్నాక పండితులు ఆలయ విశిష్టతను వివరించి వేదాశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలంటౌన్ పట్టణ సీఐ నాగరాజురెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

రేపు ఖమ్మానికి మంత్రి హరీశ్‌రావు

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభోత్సవం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర వైద్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు గురువారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆయన హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో ఖమ్మం వస్తారు. గురువారం ఉదయం 10 గంటలకు మంత్రులు ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారు. ఆతర్వాత మమత మెడికల్ కాలేజీలోని సిల్వర్ జూబ్లీ బ్లాక్‌ను ప్రారంభించి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొంటారు. ఆ తర్వాత అక్కడ ఏర్పాటుచేసిన సభలో మాట్లాడతారు. అలాగే, మధ్యాహ్నం 2.30 గంటలకు ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లిలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ భవనానికి శంకుస్థాపన చేశాక హైదరాబాద్ బయలుదేరతారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న వేణుగోపాచారి

ములకలపల్లి : విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యమని, అందు కోసమే విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేశామని టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలాచారి తెలిపారు. ములకలపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం లోకల్ కోర్టు ఏర్పాటు చేయగా, కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఆర్.చరణ్‌దాస్, ఎన్.నరేందర్, ఎస్‌ఈ రమేశ్, డీఈ సుందరయ్య, ఎస్ఏఈ మురళి, ఏడీఈ లక్ష్మణ్, ఏఈ లక్ష్మీనర్సింహారావు, ఏఏఓ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల రిలే దీక్ష

కొత్తగూడెంరూరల్: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం సర్కిల్ కార్యాలయం ఎదుట టీఎస్‌యూఈఈయూ, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొలగాని రమేష్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఆర్టిజన్ల సేవలను గుర్తించాలని కోరారు. బిల్ కలెక్టర్లు, మీటర్ రీడింగ్ వర్కర్లు, ఎస్‌పీఎం కార్మికులకు జీఓ 11 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, 2019లో విధుల్లో చేరిన జేఎల్‌ఎంలకు అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సబ్‌స్టేషన్లలో నలుగురు ఆపరేటర్లు, ఒక వాచ్‌మెన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీక్షలో గొల్లపల్లి వెంకన్న, కూనరాజు శ్రీనివాస్, లకావతు దస్రు, మోదుగు రమేష్, శ్రీలం వీరారెడ్డి, సాగర్, సంతోష్, రాజశేఖర్‌రెడ్డి కూర్చోగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లి వెంకటరాజు, భద్రాచలం డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, నాయకులు సుదర్శన వర్మ, మధుసూదన్‌రావు, పులి గణేష్‌బాబు, ఉదయ్, రత్నకుమార్ పాల్గొన్నారు.

రాజధానిలోనే తేల్చుకుందాం..



ఇల్లెందు పంచాయితీ త్వరలో కేటీఆర్ చెంతకు !

- కొరకరాని కొయ్యలా మారిన బొగ్గుట్ట
- నియోజకవర్గంలో తగ్గని అసమ్మతి జ్వాలలు
- ఇన్‌చార్జ్‌లు మారుతున్నా తీరని సమస్య

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారత రాష్ట్ర సమితి పార్టీలో రాష్ట్రమంతటా ఒక విధమైన అసమ్మతి ఉంటే ఇల్లెందులో నియోజకవర్గంలో మరో రకమైన వైరం నెలకొంది. మిగిలిన నియోజకవర్గాల్లో టికెట్ ఆశించి భంగపడిన నేతలు అసమ్మతిని రాజేస్తుంటే.. ఇక్కడ మాత్రం టికెట్ దక్కించుకున్న హరిప్రియా నాయకే వర్గపోరుకు కేంద్ర బిందువుగా మారారు. ఎన్నికల ముంగిట గడిచిన నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సింది పోయి, సొంత పార్టీ నేతలతోనే పేచీలు పెట్టుకుంటున్నారు.

చిక్కుల్లో హరిప్రియ

ఇల్లెందు నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా హరిప్రియా నాయక్ పేరు ఖరారై మూడు వారాలు గడిచినా ఆశించిన స్థాయిలో ప్రచారం జోరందుకోలేదు. అసమ్మతి నేతలు సహాయ నిరాకరణ చేస్తుండడం ఆమెకు చిక్కులు తెచ్చి పెడుతోంది. నియోజవకర్గ ఇన్‌చార్జ్ వద్దిరాజు రవిచంద్ర సోమవారం నాటి పర్యటనలోనూ పార్టీలో నెలకొన్న అంతర్గత పోరు స్పష్టంగా కనిపించింది. ఈ సమయంలో ఒక అడుగు వెనక్కి తగ్గి అసమ్మతిని చల్లార్చాల్సింది పోయి, అందుకు విరుద్ధంగా మరింతగా ఎగదోస్తున్నారనే అపవాదు హరిప్రియ మూటగట్టుకుంటున్నారు. ఇక్కడి వ్యవహారాలను కొలిక్కి తెచ్చేందుకు స్థానిక నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. చివరకు విషయం రాష్ట్ర రాజధాని బాట పట్టింది.

ఫలించని అర్ధరాత్రి చర్చలు..?

ఇల్లెందు నియోజకవర్గ నేతల మధ్య సమన్వయం కోసం రెండు రోజుల క్రితం ఖమ్మంలో ఎంపీ వద్దిరాజు ఇంట్లో ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు మొదలైన ఈ సమావేశం మరుసటి రోజు తెల్లవారుజామున 3:30 గంటల వరకు వాడీవేడిగా సాగింది. ఎమ్మెల్యే హరిప్రియానాయక్, ఆమె భర్త హరిసింగ్ ఒకవైపు, అసమ్మతి నేతలుగా ఉన్న ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, పులిగండ్ల మాధవరావు, మధుకర్‌రెడ్డి, కృష్ణప్రసాద్ తదితరులు మరో వర్గంగా వాదనలకు దిగినట్టు తెలుస్తోంది. నాలుగు గంటలకు పైగా జరిగిన ఈ చర్చల్లో ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు కొనసాగించడం తప్పితే సఖ్యత సాధించలేకపోయినట్టు సమాచారం.

అధిష్టానం వద్దకు వెళదాం..

ఎమ్మెల్యే హరిప్రియానాయక్, ఆమె భర్త హరిసింగ్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారనేది అసమ్మతి నేతల ప్రధాన ఆరోపణ. ఈ విషయంలో తమకు పార్టీ పెద్దల నుంచి స్పష్టమైన హామీ కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే, అకారణంగా తనపైనా, తన భర్త హరిసింగ్‌పైనా అసమ్మతి నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తమ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే హరిప్రియ వాదిస్తున్నారు. ఈ విషయంలో ఏ ఒక్కరూ వెనక్కు తగ్గడం లేదు. రేగా కాంతారావు మొదలు వద్దిరాజు వరకు అనేక మంది నేతలు సఖ్యత కోసం ప్రయత్నించినా ఫలితం రాలేదు. దీంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఈ పంచాయితీ తేల్చుకుంటామని అసమ్మతి నేతలు అంటున్నారు. కేటీఆర్ అపాయింట్‌మెంట్ లభించకపోతే పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి హరీశ్‌రావు దృష్టికి ఇల్లెందు వ్యవహారాలను తీసుకెళతామని అంటున్నారు. ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావు అపాయింట్‌మెంట్ కోసం అసమ్మతి వర్గం ప్రయత్నిస్తోంది.

ముగ్గురు ప్రయత్నించినా..

ఇల్లెందు నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండటంతో ఆ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షులైన విప్ రేగా కాంతారావు, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తాతా మధు తమవంతు ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఏడాది కాలంగా ముగ్గురు జిల్లా అధ్యక్షులు చెమటోడ్చినా ఇక్కడి నేతల మధ్య సమన్వయం తీసుకురావడంలో విఫలమయ్యారు. ఇటీవల ఇల్లెందు నుంచి పోటీకి రెండోసారి హరిప్రియా నాయక్‌కు అవకాశం ఇచ్చారు. నియోజవకర్గ ఇన్‌చార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను ప్రకటించారు. దీంతో అసమ్మతి వ్యవహారం ఓ కొలిక్కి వస్తుందనే భావన కలిగింది.

మహిళల ఆరోగ్యమే లక్ష్యం

కలెక్టర్ ప్రియాంక ఆల



అశ్వాపురం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

అశ్వాపురం: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. అశ్వాపురం పీహెచ్‌సీలో మంగళవారం ఆమె ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొదటి దశలో మార్చి 8న జిల్లాలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రెండో విడతలో 9 మండలాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆరోగ్య సమస్యలను బయటకు చెప్పుకోలేక ఇబ్బంది పడుతున్న మహిళల కోసమే ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సెంటర్లలో ప్రతి మంగళవారం మహిళా వైద్యులే ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, కిశోర బాలికల నుంచి వృద్ధుల వరకు కేన్సర్, థైరాయిడ్, బీపీ, రక్తహీనత వంటి వ్యాధులకు పరీక్షలు చేయించుకోవచ్చని వివరించారు. టీ హబ్ ద్వారా 134 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, అవసరమైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రులతో పాటు హైదరాబాద్‌లో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు.

పనుల్లో జాప్యంపై ఆగ్రహం

మండల పరిధిలోని సీతరాంపురం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు అంబేద్కర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక ఆల తనిఖీ చేశారు. పాఠశాలలో చేపడుతున్న మన ఊరు-మన బడి పనులు పూర్తయినట్లు నివేదికలు ఇచ్చారని, ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయని ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈ రమేష్, ఏఈ గణేష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. వారం రోజుల్లో అన్ని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం అపరిశుభ్రంగా ఉందని, ఇలా అయితే చిన్నారులు ఎలా ఆరోగ్యంగా ఉంటారని సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలోని 74 అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రం చేయించి ఫొటోలతో నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ శిరీష, అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, సంక్షేమాధికారి విజేత, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, ఎంపీపీ ముత్తినేని సుజాత, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈ రమేష్, విద్యాశాఖ కో ఆర్డినేటర్ సైదులు, ఐసీడీఎస్ సీడీపీఓ సీత పాల్గొన్నారు.

పరిశుభ్రతకు పట్టం

- నేడు ఉత్తమ గ్రామాలకు అవార్డులు
- జిల్లాలో 15 పంచాయతీలు ఎంపిక

చుంచుపల్లి : ఆరోగ్యవంతమైన గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను భాగస్వాములను చేస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమం ద్వారా అవార్డులు అందిస్తోంది. ఈ ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమంగా నిలిచిన 15 గ్రామ పంచాయతీలను అధికారులు ఎంపిక చేయగా, కలెక్టర్ ప్రియాంక ఆల ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు బుధవారం అవార్డులు ప్రదానం చేయనున్నారు.

గ్రామాల ఎంపిక ఇలా..

గ్రామ పంచాయతీల పరిధిలో మరుగుదొడ్లు, సెగ్రిగేషన్ షెడ్లు, మురుగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, ఇంకుడు గుంతల నిర్మాణం, చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత, వాల్ పెయింటింగ్స్, తడి, పొడిచెత్త సేకరణ, ఎరువుల తయారీ, ప్లాస్టిక్ నిషేధం, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పారిశుద్ధ్య చర్యలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని జిల్లా స్థాయిలో 15 పంచాయతీలను ఎంపిక చేశారు. వీటిలో రెండువేల జనాభా, 2 నుంచి 5 వేలు, 5 వేలకు పైగా జనాభా ఉన్న గ్రామాల వారీగా ప్రాధాన్యతా క్రమంలో మార్కులు కేటాయించారు. జిల్లా స్థాయిలో ఉత్తమంగా ఎంపికైన వాటిలో పాల్వంచ మండలం తోగ్గూడెం, దమ్మపేట మండలం ఆకినేపల్లి, దుమ్ముగూడెం మండలం కోయనర్సాపురం, చుంచుపల్లి మండలం గౌతంపూర్, ధన్‌బాద్, అశ్వాపురం మండలం సంద్రాలబోడు, ములకలపల్లి మండలం పూసుగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం, పెద్దిరెడ్డి గూడెం, సుజాతనగర్ మండలం నాయకులగూడెం, బూర్గంపాడు మండలం ఇరవెండి, మణుగూరు మండలం కట్టుమల్లారం, ఇల్లెందు మండలం చల్లసముద్రం, రొంపేడు, గుండాల ఉన్నాయి. ఇందులో ములకలపల్లి మండలం పూసుగూడెం రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా ఎంపిక కాగా, ఈ పంచాయతీకి ఈ నెల 14న హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం చేయనున్నారు.

తోగ్గూడెం జీపీకి అవార్డు

పాల్వంచరూరల్: మండలంలోని తోగ్గూడెం గ్రామపంచాయతీకి జిల్లా స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అవార్డు దక్కింది. ఈ పంచాయతీలో 1,625 జనాభా ఉండగా, వంద శాతం మరుగుదొడ్లు, ఇంటింటికీ ఇంకుడుగుంతలు నిర్మించడంతో పాటు పారిశుద్ధ్య లోపం లేకుండా తీసుకుంటున్న చర్యలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. కలెక్టర్ చేతుల మీదుగా సర్పంచ్ శాంతి, కార్యదర్శి బుధవారం అవార్డు అందుకుంటారని ఎంపీడీఓ అప్పారావు తెలిపారు.

సోలార్‌పై ప్రముఖ కంపెనీల ఆసక్తి

- ప్రీ బిడ్ ఈవెంట్‌కు 10 కంపెనీల హాజరు
- టెండర్ల దాఖలకు 25 వరకు అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): రెండో దశలో నిర్మిస్తున్న 232 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం కోసం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశానికి దేశవ్యాప్తంగా 10 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో టాటా సోలార్ పవర్‌తో పాటు, ఎన్రిచ్ ఎనర్జీ, నోవాస్ గ్రీన్ ఇంజనీరింగ్, ఎర్త్ ఇన్ ప్రాజెక్ట్ వంటి ప్రముఖ కంపెనీలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎనిమిది ఏరియాల్లో చేపట్టనున్న సోలార్ ప్లాంట్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మొత్తం 232 మెగావాట్లకు సంబంధించి మూడు టెండర్లుగా నిర్మాణ ఏజెన్సీలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. నిర్మాణ ప్రదేశాలను, అక్కడికి గల రవాణా సౌకర్యాలను నిర్మాణ ఏజెన్సీలు స్వయంగా పరిశీలించవచ్చని తెలిపారు. ఈనెల 25 లోగా టెండర్లు సమర్పించాలని, టెండర్లు ఖరారైన తర్వాత కచ్చితంగా ఏడాదిలోపు నిర్మాణాలు పూర్తి చేయాలని, నిర్మాణ దశలను బట్టి బిల్లులను చెల్లిస్తామని సింగరేణి ఆర్థిక విభాగం అధికారులు వివరించారు. కార్యక్రమంలో సింగరేణి సోలార్ సారథ్య బాధ్యతలు నిర్వహిస్తున్న డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి. సత్యనారాయణ రావుతో పాటు పలువురు జీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు రుద్రహోమం

పాల్వంచరూరల్ : మండల పరిధిలో వేంచేసి ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో బుధవారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు యాగశాలలో హోమం ఉంటుందని, పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. మగవారు ధోతి, కుండువా, మహిళలు చీరలు ధరించాలని సూచించారు. వివరాలకు 9866923261, 6303408458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సన్నాహకం.. రసాభాస

- కాంగ్రెస్ విజయభేరి ముందస్తు సమావేశంలో ఆందోళన
- అనుచర నేతలు, కేడర్ నినాదాలతో దద్దరిల్లిన డీసీసీ కార్యాలయం
- పాత నేతలు, బీసీలకే టికెట్లు ఇవ్వాలని డిమాండ్
- పార్లమెంటరీ ఇన్‌చార్జ్ ముందు బలప్రదర్శన



నసీంఖాన్ ఎదుట నినాదాలు చేస్తున్న ఆశావహుల అనుచరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం డీసీసీ కార్యాలయం వేదికగా ఏర్పాటుచేసిన విజయభేరి సన్నాహక సమావేశం రసాభాసగా సాగింది. తమ నేతకే టికెట్ ఇవ్వడంతో పాటు పాత నేతలకే పట్టం కట్టాలని, బీసీలను ఈసారైనా పట్టించుకోవాలనే నినాదాలు హోరెత్తాయి. ఒక దశలో వేదికపై ఉన్న నేతలపై కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు. ఈనెల 17న హైదరాబాద్‌లో జరగనున్న విజయభేరి సభ విజయవంతానికి ఖమ్మం పార్లమెంట్ స్థాయిలో డీసీసీ కార్యాలయం వేదికగా మంగళవారం సన్నాహక సమావేశం ఏర్పాటుచేశారు. మహారాష్ట్ర మాజీ మంత్రి, ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జి ఆరిఫ్ నసీంఖాన్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భద్రాది ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు. ఈసమావేశం ప్రశాంతంగానే మొదలైనా, ఆ కాసేపటికే నినాదాలు, కార్యకర్తల ఆగ్రహావేశాలతో సాగింది.

అనుచర నేతలకు జై..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వారి అనుచరులు ఈసమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ముఖ్యులను పరిచయం చేస్తుండగానే అనుచర నేతలు నినాదాలు మొదలుపెట్టారు. తమ నాయకుల పేర్లతో పోటాపోటీగా నినాదాలు చేస్తూ దూసుకొచ్చారు. వేదికపై ఉన్న భట్టి, రేణుకాచౌదరితోపాటు పువ్వాళ్ల వారిని వారించినా నినాదాలు సద్దుమణగలేదు. ఇక పార్టీ జెండా మోసిన నేతలకే టికెట్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. కొత్తగా వచ్చిన వారికి టికెట్లు ఇవ్వొద్దని, జనాభా ప్రాతిపదికన ఉమ్మడి జిల్లాలోని మూడు జనరల్ స్థానాల్లోనూ బీసీలకు కూడా టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం నుంచి వచ్చిన నేతలు సైతం ఇదే డిమాండ్ వ్యక్తం చేశారు. సమావేశం ముగిశాక కూడా టికెట్లు ఆశిస్తున్న నేతలు, వారి అనుచరులు పార్లమెంట్ ఇన్‌చార్జి నసీంఖాన్‌ను కలిసి కష్టపడి పనిచేస్తున్న వారికి టికెట్లు ఇవ్వకపోతే నష్టం జరుగుతుందని పరోక్షంగా హెచ్చరించారు.

వీహెచ్‌పై గరం గరం


సమావేశాన్ని ఉద్దేశించి మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతుండగా టికెట్ ఆశిస్తున్న వారి అనుచరులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇతర జిల్లాల నేతలకు ఇక్కడేం పని, జిల్లాలో ఎవరు సీనియర్, ఎవరు జూనియరో నీకేం తెలుసు' అంటూ మండిపడ్డారు. దీంతో వీహెచ్ కూడా వారిపై ఆగ్రహం వ్యక్తం చేయగా.. వేదికపైన ఉన్న నేతలు సముదాయిస్తున్నా నినాదాలు ఆగలేదు. దీంతో వీహెచ్ ప్రసంగాన్ని ముగించారు. అంతకుముందు భట్టి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో ఉండాలని, విజయభేరి సభను విజయవంతం చేసేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ఆ తర్వాత ఆయన తనకు పార్టీ పెద్దలతో జూమ్ మీటింగ్ ఉందంటూ డీసీసీ కార్యాలయంలోని చాంబర్‌లోకి వెళ్లిపోగా, ఆతర్వాత పొంగులేటి కూడా వెళ్లిపోయారు. సమావేశంలో నాయకులు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, పోట్ల నాగేశ్వరరావు, ఎడవల్లి కృష్ణ, విజయాబాయి, ఎండీ.ముస్తఫా, ఎం.డీ.జావిద్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీనాయక్, దొబ్బల సౌజన్య, రామ్మూర్తి నాయక్, కోటూరి మానవతారాయ్ పాల్గొన్నారు. కాగా, సమావేశం ఆద్యంతం నినాదాలు ఆపకపోవడంతో ముఖ్య నేతలు ప్రసంగాలు కొనసాగించడంతో సన్నాహక సమావేశం కాస్తా టికెట్లు ఆశిస్తున్న వారి బలప్రదర్శనకు వేదికగా మారినట్లయింది.

తెలంగాణ ఇచ్చిన దేవత.. సోనియా

తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీ అని కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ పరిశీలకులు మహ్మద్ ఆరిఫ్ నసీంఖాన్ అన్నారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పది అసెంబ్లీ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా అంటే సోనియా, రాహుల్‌కు ఎంతో అభిమానమని, పార్టీ జెండా పట్టుకుని.. బలోపేతం చేస్తున్న వారందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. కాగా, తెలంగాణ వచ్చిన పదేళ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ బీజేపీకే మద్దతు ఇస్తుండంతోనే మహారాష్ట్రకు వస్తున్నారని పేర్కొన్నారు.

- ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి అన్నారు. నలభై ఏళ్లుగా పార్టీ జెండాలను మోసిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని.. తప్పుడు నివేదికలతో కొందరికి అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని విమర్శించారు. ఏదిఏమైనా కాంగ్రెస్ గాలి వీస్తుండడంతో వచ్చేది తమ ప్రభుత్వమేనని తెలిపారు.
- కాంగ్రెస్ పార్టీ ఒక కుటుంబం లాంటిదని, ఇక్కడ గొడవలు పెట్టుకోవద్దని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. పెద్ద వారిని గౌరవించుకోవాలని తెలిపారు. అందరం కలిసికట్టుగా ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నందున వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

తాలిపేరుకు పోటెత్తిన వరద



24 గేట్లు ఎత్తి 20, 687 క్యూసెక్కుల నీరు విడుదల

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లో రెండు రోజులగా భారీ వర్షాలు కురుస్తుండడంతో వరద వస్తోంది. దీంతో మంగళవారం ఉదయం నుంచి ప్రాజెక్టుకు చెందిన 24 గేట్లను ఎత్తి 20,687 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువన ఉన్న గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74.00 మీటర్లు కాగా, వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకుని నీటిమట్టాన్ని 73.67 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రాజెక్టు డీఈ తిరుపతి తెలిపారు.

క్లుప్తంగా

ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

డీఎస్పీ రమణమూర్తి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

టేకులపల్లి: రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి అన్నారు. సోమవారం రాత్రి రోళ్లపాడు క్రాస్‌రోడ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనా స్థలాన్ని మంగళవారం ఆయన టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డితో కలిసి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మూల మలుపుల వద్ద, ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్‌ఐకి సూచించారు.

తపాలా శాఖలో పార్సిల్ ప్యాకింగ్ యూనిట్

దుమ్ముగూడెం: తపాలాశాఖ కార్యాలయాల్లో కొత్తగా పార్సిల్ ప్యాకింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు భద్రాచలం నార్త్ సబ్ డివిజన్ ఏఎస్పీ వి.సుచేందర్ తెలిపారు. దుమ్ముగూడెం సబ్ పోస్టాఫీస్‌ను మంగళవారం సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. భద్రాచలం డివిజన్ పోస్టాఫీస్‌లో పార్సిల్ ప్యాకింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయగా, దూరప్రాంతాలకు పంపించే వస్తువులను తక్కువ ధరకే ప్యాకింగ్ చేయనున్నట్లు తెలిపారు. అలాగే, విదేశాలకు తపాలా శాఖ ద్వారా పార్సిళ్లు పంపిస్తే త్వరగా కస్టమ్స్ క్లియరెన్స్ రానుందని వివరించారు. ఈ సర్వీస్‌లో పేరు నమోదు చేసుకున్న వారి ఇంటికే పోస్టల్ సిబ్బంది వచ్చి సేవలందిస్తారని తెలిపారు. ఇక రైల్వేశాఖతో కలిసి ఎక్స్‌ప్రెస్ కార్గో సేవలు ప్రారంభించామని, ఇందులో పంపించే పార్సిళ్లకు బీమా వర్తిస్తుందని సుచేందర్ చెప్పారు. ఈ సమావేశంలో సబ్ పోస్ట్‌మాస్టర్ ఎస్‌వీ రావు, సిబ్బంది కిరణ్, నందగోపాల్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బాసటగా సీఎంఆర్‌ఎఫ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పేద వర్గాలకు ఎంపీ నామ నాగేశ్వరరావు బాసటగా నిలుస్తున్నారని ఎంపీ క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి కనకమేడల సత్యనారాయణ తెలిపారు. ఎంపీ నామ నాగేశ్వరరావు సిఫారసుతో చంద్రుగొండ మండలానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన ఖమ్మంలో అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా టెలికాం సలహా మండలి సభ్యుడు చిత్తారు సింహాద్రియాదవ్‌తో పాటు నల్లమోతు వెంకటనారాయణ, పత్తిపాక వెంకన్న, పాల్వంచ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నాకు ప్రాణహాని ఉంది

ఇల్లెందు మున్సిపల్ వైస్ చైర్మన్‌పై మేనేజర్ ఫిర్యాదు

ఇల్లెందు: మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా వల్ల తనకు ప్రాణ హాని ఉందని మున్సిపల్ మేనేజర్ అంకుషావలి డీఎస్పీ రమణమూర్తికి మంగళవారం ఫిర్యాదు చేశారు. తన వ్యక్తిగత విషయంలో జానీపాషా తలదూర్చి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రవర్తించారని పేర్కొన్నారు. కమిషనర్ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని, ఆయనను కౌన్సిలర్ పదవి నుంచి తప్పించాలంటూ రెండు నెలల క్రితం ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, దీంతో కక్ష కట్టి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై వైస్ చైర్మన్ జానీపాషాను వివరణ కోరగా.. మున్సిపల్ కార్యాలయంలో పని వేళలో జరిగిన ఓ ఘర్షణతో కార్యాలయ ప్రతిష్ఠకు భంగం కలిగిందని, దీనిపై పలువురు కౌన్సిలర్లతో కలిసి మేనేజర్‌పై కమిషనర్‌కు మౌఖికంగా ఫిర్యాదు చేశామని, అయితే అంకుషావలి తనపై కక్షతో తనను టార్గెట్ చేస్తూ ఫిర్యాదు చేసి ఉంటారని తెలిపారు.


రిటైర్డ్ హెచ్‌ఎంకు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లుకు చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మద్దిశెట్టి వెంకటేశ్వరరావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు అందుకున్నారు. అర్పిత స్వచ్ఛంద సేవా సంస్థ 22వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావుకు అవార్డు అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

ముస్తాబైన 'ఆది దేవుడు'

- జిల్లాలో మొదలైన వినాయక విగ్రహాల విక్రయం
- తీరొక్క రీతుల్లో లభిస్తున్న గణపతి ప్రతిమలు
- ఈనెల 18న వినాయక చవితి





చుంచుపల్లి తండా రోడ్డులో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు, (ఇన్‌సెట్) పోస్టాఫీస్ సెంటర్‌లో..

కొత్తగూడెంటౌన్: వినాయక చవితి నవరాత్రులు మరో ఆరు రోజుల్లో ప్రారంభం కానున్నాయి. అయితే ఇప్పటికే విగ్రహాల విక్రయాలు ప్రారంభమయ్యాయి. కొందరు మండపాల నిర్వాహకులు ముందుగానే అడ్వాన్స్ చెల్లించి తమకు ఇష్టమైన రూపాల్లో విగ్రహాలను తయారు చేయించుకున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు తదితర ప్రాంతాలకు రాజస్థాన్ నుంచి ఆరు నెలల క్రితమే చేరుకున్న విగ్రహాల తయారీదారులు రేయింబవళ్లు కష్టపడి గణనాథులను విభిన్న రూపాల్లో తీర్చిదిద్దారు. జిల్లా కేంద్రం కొత్తగూడెం సమీపంలోని చుంచుపల్లి తండాలో భారీ గుడారం ఏర్పాటు చేసి పలు రకాల విగ్రహాలను విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్, ప్రకాశం స్టేడియం ఎదుట కూడా వినాయక విగ్రహాలను అమ్ముతున్నారు.

18 నుంచి 28 వరకు..

వినాయక చవితి పండుగ ఈనెల 18న జరగనుండగా 28 వరకు వేడుకలు నిర్వహిస్తారు. అనంతరం భద్రాచలం గోదావరి, స్థానికంగా ఉండే చెరువులు, వాగుల్లో విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఈ ఏడాది వినాయక చవితి పండుగను భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించకుండా మట్టి విగ్రహాల ఏర్పాటుకు పలువురు ముందుకొస్తున్నారు. 'ప్లాస్టరాఫ్ ప్యారిస్ వద్దు.. మట్టి విగ్రహాలే ముద్దు' నినాదంతో అధికారులు, స్వచ్ఛంద సంస్థల వారు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది ముందుగా ఆర్డర్ ఇచ్చి మట్టి విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు. ఇక మట్టి, ప్లాస్టరాఫ్ ప్యారిస్ విగ్రహాలు సైజ్‌ను బట్టి రూ.3 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారు.

చేతినిండా పని..

వినాయక చవితికి ఆరు నెలల ముందుగానే రాజస్థాన్ నుంచి విగ్రహాల తయారీదారులు జిల్లాకు వస్తున్నారు. సున్నం, కొబ్బరి పీచు వంటి వాటితో ప్లాస్టరాఫ్ ప్యారిస్ విగ్రహాలు తయారు చేసి, పలు రకాల రంగులతో ఆకర్షణగా తీర్చిదిద్దుతున్నారు. తయారీదారులకు వారి యజమానులు నెలకు రూ.6 నుంచి 8 వేల వరకు వేతనంతో పాటు విగ్రహాల అమ్మకాలను బట్టి కమీషన్ కూడా చెల్లిస్తున్నారు. దీంతో చేతినిండా పనితో పాటు ఆదాయం కూడా బాగానే సమకూరుతోందని తయారీదారులు చెబుతున్నారు.

ప్రత్యేకంగా తయారు చేయించి..



వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేయించాం. ముందుగానే డబ్బు చెల్లించి హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తయారు చేయించి, ఇక్కడికి తీసుకొచ్చి అమ్ముతున్నాం. ఇప్పుడిప్పుడే కొనుగోళ్లు ప్రారంభమవుతున్నాయి. ఈసారి ఎక్కువ మంది మండపాలు ఏర్పాటు చేస్తుండడంతో గిరాకీ బాగానే ఉంటుందని ఆశిస్తున్నాం.

– శ్రీకాంత్, వ్యాపారి, రామవరం

ఆర్డర్లు ఎక్కువగానే వస్తున్నాయి



ఈసారి చాలా మంది ముందుగానే డబ్బు చెల్లించి వినాయక విగ్రహాలు బుక్ చేసుకుంటున్నారు. గత రెండేళ్లుగా సరైన ఆదాయం లేకున్నా ఈ సంవత్సరం గిరాకీ బాగానే ఉంటుందనే నమ్మకం కుదిరింది. కొత్తగూడెంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా కొనుగోళ్లకు ఇప్పటినుంచే వస్తున్నారు. వినాయకుడి దయతో ఈసారి ఆదాయం బాగానే వచ్చేలా ఉంది.

– రామాంజీ, విగ్రహాల వ్యాపారి, రాజస్థాన్

పదేళ్లుగా పని చేస్తున్నా



రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నాం. నేను గత పదేళ్లుగా కొత్తగూడెం వస్తున్నా. ప్రతి వినాయక చవితికి ఆరునెలల ముందుగానే వచ్చి విగ్రహాల తయారీలో నిమగ్నం అవుతాం. రోజుకు రూ.400 కూలి ఇస్తారు. ఈ సారి కూలితో పాటు కొంత కమీషన్ కూడా ఇస్తామని చెప్పడంతో సంతోషంగా ఉంది.

– సంజీవ్‌కుమార్, విగ్రహాల తయారీదారుడు, రాజస్థాన్

విద్యార్థులే రచయితలు!

- సొంత గ్రామాల చరిత్రపై పుస్తకాలు
- తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన రూపకల్పన
- ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కాలేజీలో స్వీకరించిన చైర్మన్ గౌరీశంకర్



పుస్తకాలను గౌరీశంకర్‌కు అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, కాలేజీ ప్రిన్సిపాల్ జకీరుల్లా

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ సాహిత్య అకాడమీ చేపట్టిన 'మన వూరు – మన చరిత్ర' కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు రాష్ట్రంలోని రెండు వేల గ్రామాల చరిత్ర నమోదైందని అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు 568మంది తమ గ్రామాల చరిత్రను పుస్తకాల రూపంలో సిద్ధం చేయగా... ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా మంగళవారం చైర్మన్ గౌరీశంకర్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ ఏడాది క్రితం డిగ్రీ విద్యార్థులతో వారి స్వగ్రామాల చరిత్ర రాయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ప్రిన్సిపాళ్లు, అధ్యాపకుల సహకారంతో ఇప్పటివరకు రెండు వేల గ్రామాల చరిత్ర సిద్ధమైందని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు తమ గ్రామాల ప్రత్యేకతలపై అవగాహన పెరగడమే కాక వారిలోని సృజనాత్మక శక్తి వెలికితీసినట్లవుతుందని తెలిపారు. ప్రతీ గ్రామ చరిత్ర, ప్రత్యేకతలే కాక తెలంగాణ రాక ముందు, వచ్చాక జరిగిన అభివృద్ధిని పుస్తకాల రూపంలో సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఊరి చరిత్రను రాసిన వారిని గ్రామస్తులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. విద్యార్థులు రాసిన చరిత్రే భవిష్యత్ తరాలకు గెజిట్‌గా మారుతుందని చెప్పారు. సాహిత్య అకాడమీ చేపట్టిన ఈ కార్యక్రమానికి అండగా నిలవడమే కాకుండా విద్యార్థులు రాసిన పుస్తకాలను వెలుగులోకి తేవడానికి సహకరిస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ బీ.వీ.రెడ్డి, టి.జీవన్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ సీతారాం, మిల్టన్, జె.రమేష్, డాక్టర్ సర్వేశ్వరరావు, డాక్టర్ వరలక్ష్మి, అత్తోట సాంబశివరావు పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి.. కేంద్రం తెరిచి..

- అంగన్‌వాడీల సమ్మెపై అధికారుల ఆగ్రహం
- సరుకుల సరఫరా బాధ్యత కార్యదర్శులకు అప్పగింత



పాల్వంచ మండలం నాగారంలో అంగన్‌వాడీ కేంద్రం తాళం పగులగొడుతున్న సిబ్బంది

పాల్వంచరూరల్/కొత్తగూడెంటౌన్ : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెకు దిగడం, ఆయా కేంద్రాలకు వేసిన తాళాలు అప్పగించకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో తాళాలు పగులగొట్టి తెరిపించారు. ఆయా కేంద్రాల పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరుకుల పంపిణీ బాధ్యతలను మున్సిపాలిటీల్లో బిల్ కలెక్టర్లకు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు అప్పగించామని జిల్లా సంక్షేమశాఖ అధికారి విజేత తెలిపారు. అయితే తమ ప్రమేయం లేకుండా కేంద్రాలు ఎలా తెరుస్తారంటూ టీచర్లు, ఆయాలు పలుచోట్ల ధర్నా, రాస్తారోకోలు చేశారు. తమపై దౌర్జన్యం చేసి సమ్మె విరమింపజేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారని, అయినా భయపడేది లేదని స్పష్టం చేశారు. కాగా, అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట, కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో సమ్మె చేశారు. వారి ఆందోళనకు పలు పార్టీల నాయకులు మద్దతు ప్రకటించారు.

గుండాలలో విఫలయత్నం



తాళం పగలగొడుతుండగా అడ్డుకుంటున్న వర్కర్లు

గుండాల: అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి సిబ్బంది నిరసనలో పాల్గొనగా.. మంగళవారం ఐసీడీఎస్ అధికారులు తాళాలను పగులగొట్టే ప్రయత్నం చేశారు. ఇతర ఉద్యోగుల చేత కేంద్రాన్ని కొనసాగించాలనేది వారి ఆలోచన. కానీ, అంగన్‌వాడీ ఉద్యోగులు మూకుమ్మడిగా ఆ ప్రయత్నాలను అడ్డుకుని నినాదాలు చేశారు.

సాగు భూముల సర్వేపై నీలినీడలు

- జేకే ఓసీ నిర్వాసిత భూములపై సందిగ్ధం
- ఎటూ తేలని రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు
- నేటి నుంచి రీ సర్వేకు అధికారుల సమాయత్తం



రైతులతో చర్చిస్తున్న అటవీశాఖ అధికారులు

ఇల్లెందురూరల్: ఇల్లెందులో జేకే ఓసీ నిర్వాసిత సాగు భూముల ప్రాంతం నిన్నటివరకు అక్రమాలకు నిలయంగా మారగా తాజాగా కొత్త వివాదం తెరపైకి వచ్చింది. దీంతో సర్వేపై నీలినీడలు కమ్ముకున్నాయి. సింగరేణి సంస్థ నూతనంగా ప్రారంభించనున్న జేకే ఓసీకి సంబంధించి సర్వే నంబర్ 549 పరిధిలో సాగుభూముల నిర్వాసిత ప్రాంతాన్ని 151 ఎకరాలుగా నిర్ధారించారు. రెవెన్యూ, సింగరేణి, అటవీశాఖల అధికారులు ఏడాది కాలంగా కసరత్తు చేసి ఆర్డీఓ అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామసభలో నిర్వాసిత రైతుల జాబితా రూపొందించారు. అయితే, జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆధారాలతో 'సాక్షి' వరుస కథనాలతో వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యాన అటవీశాఖ బీట్ అధికారిని సస్పెండ్ చేశారు. తాజాగా గత జాబితాను రద్దుచేసి సమగ్రంగా నిర్వాసిత సాగు భూముల్లో రీసర్వే చేయాలని అటవీశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

చర్చలు.. వాదోపవాదాలు

రీ సర్వే చేపట్టేందుకు మంగళవారం అధికారులు వచ్చినా పూర్తిస్థాయిలో రైతులు రాలేదు. దీంతో హాజరైన అధికారులు, రైతుల మధ్య పలు అంశాలపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. నిర్వాసిత భూమిలో రెవెన్యూ, అటవీభూముల జాయింట్ సర్వే జరగలేదని, అధికారులు చెబుతున్నట్లు నిర్వాసిత సాగు భూమి మొత్తం అటవీశాఖది కాదని, కొంత రెవెన్యూ భూమి కూడా ఉందని రైతులు చెప్పారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న భూములను అటవీ శాఖవిగా చెప్పడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాస్తవంగా సర్వేనంబర్ 549 మొత్తం 650 నుంచి 700 ఎకరాలలో విస్తరించి ఉందని తెలిపారు. ఇందులో 316.25 ఎకరాలే అటవీ భూమిగా గెజిట్‌లో ఉన్నందున అటవీ, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి వాస్తవాలు తేల్చాలని కోరారు. ఈ విషయమై స్పందించిన ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న మాట్లాడుతూ బుధవారం నుంచి సర్వే చేపడుతామని తెలిపారు. నిర్వాసిత రైతులందరూ భూముల వద్దకు రావాలని సూచించారు. ఈసమావేశంలో ఎఫ్‌ఆర్‌ఓ నాగేశ్వరరావు, డీఆర్‌ఓలు సాల్మన్‌రాజ్, రాంసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల అప్పగింత

పాల్వంచ : చర్ల నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 23 ఆవులు, ఎద్దులను మంగళవారం భద్రాచలంలో పోలీసులు పట్టుకున్నారు. వీటిని సంరక్షణ నిమిత్తం పాల్వంచలోని అన్నపూర్ణ గో సంరక్షణ సమితి వారికి అప్పగించారు. వాహనంలో కిక్కిరిసి తీసుకురావడంతో ఒక ఎద్దు మృతి చెందదని, గో సంరక్షణ సమితి నిర్వాహకులు ఆంజనేయ శర్మ తెలిపారు.

మోకాళ్ల నొప్పుల నుంచి విముక్తి

- అందుబాటులోకి రోబోటిక్ సర్జరీ
- వివరాలు వెల్లడించిన డాక్టర్ సునీల్



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్

కొత్తగూడెం రూరల్: మోకాళ్ల మార్పిడి ఆపరేషన్ ఇప్పుడు ఎంతో సులభతరం అయిందని ప్రముఖ ఆర్థోపెడిక్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ దాచేపల్లి సునీల్ తెలిపారు. మంగళవారం కొత్తగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మోకాళ్ల మార్పిడిలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య సేవలను వివరించారు. ఒక వయసు దాటిన తర్వాత మోకాళ్ల నొప్పులతో ఎంతో మంది జీవితం దుర్భరంగా మారుతోందని అన్నారు. గతంలో మోకాళ్ల మార్పిడి శస్త్ర చికిత్స క్లిష్టంగా ఉండేదని, ఆపరేషన్ తర్వాత అనేక సమస్యలు వచ్చేవని, దీంతో చాలామంది ఆపరేషన్‌కు వెనుకంజ వేసేవారని తెలిపారు. కానీ లండన్‌లో కూడా దొరకని రోబోటిక్ వైద్య సేవలు ఇప్పుడు హైదరాబాద్, కొత్తగూడెంలో అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రోబోటిక్ సర్జరీలు 98 శాతం విజయవంతం అవుతున్నాయన్నారు. ఆపరేషన్ చేసిన నాలుగు గంటల్లోనే నడిచే వీలుందని, మూడు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ కావచ్చని అన్నారు. రోబోటిక్ సర్జరీకి సగటున రూ.2.50 లక్షల వ్యయం అవుతుందని, కీళ్ల మార్పిడి ఆపరేషన్‌కు రూ.1.50 లక్షల వ్యయం అవుతుందని తెలిపారు. తాను కొత్తగూడెంలోనే పుట్టి పెరిగానని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో పని చేస్తున్నానని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రతీ నెల రెండో మంగళవారం ఇక్కడ క్యాంపు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ బి.పురుషోత్తం తెలిపిన వివరాల మేరకు.. చంద్రుగొండ మండలం పోకలగూడేనికి చెందిన ఎస్‌కే నాగుల్‌మీరా మేకలబండతండా(అన్నారంతండా)కు చెందిన కేలోత్ శ్రీను జూలూరుపాడు పరిసర గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నారు. దీంతో సమాచారం తెలియడంతో పోలీసులు వెంబడించి అనంతారం గ్రామం వద్ద వారిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డీజిల్ చోరీ ఘటనలో అరెస్ట్

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం, ములకపాడు ఏరియాల్లో లారీల నుంచి డీజిల్‌ను దొంగిలించిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ కేశవరావు మంగళవారం తెలిపారు. సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గత జూలైలో లక్ష్మీనగరం, ములకపాడు గ్రామాల్లో వాహనాల నుంచి డీజిల్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో దబ్బనూతుల గ్రామానికి చెందిన తెల్లం నాగరాజు, ములకలపల్లి మండలం డి.కొత్తూరుకు చెందిన సోయం సింగరాజు, పొడియం రమేష్ ఉన్నారని, వారి నుంచి రూ.15వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వివరించారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

కొత్తగూడెంటౌన్: జిల్లా ఏఆర్ విభాగంలో పని చేస్తూ అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ టి.రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులకు రూ.60 వేల చెక్కును ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏఓ జయరాజు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఏసోబు, శ్రీనివాస్, సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ మధు తదితరులు పాల్గొన్నారు.

నిరాదరణకు గురైన వ్యక్తి వృద్ధాశ్రమానికి..



బస్టాండ్‌లో ఉన్న వృద్ధుడు నారాయణ

బూర్గంపాడు: కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన ఓ వృద్ధుడు రెండు రోజులుగా మోతె పట్టీనగర్ బస్టాండ్‌లో ఉంటున్నాడు. అతడి గురించి స్థానికులు వాకబు చేయగా తన పేరు బర్ల నారాయణ అని, తనది తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామమని చెప్పాడు. అంతకుమించి ఏ వివరాలు తెలపకపోవడంతో గ్రామస్తులు మంగళవారం బూర్గంపాడు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించినా అతడు చెప్పకపోవటంతో పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ నాయకులు వల్లూరిపల్లి వంశీ సహకారంతో భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమంలో చేర్పించారు.

విషజ్వరంతో వివాహిత మృతి

పాల్వంచరూరల్ : విషజ్వరంతో వివాహిత మృతిచెందిన ఘటన మండల పరిధిలోని సోములగూడెంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తేనే రజిత(25) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు పాల్వంచలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందినా జ్వరం తగ్గకపోవడంతో ఖమ్మం తీసుకవెళ్తుండగా మధ్యలోనే మృతిచెందింది. రజితకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హనుమకొండలో వ్యక్తి హత్య

నిందితుడు గుండాల మండలం వాసి

వరంగల్ క్రైం: హనుమకొండ జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో హత్య జరిగింది. అశోకా జంక్షన్ పక్కనే ఉన్న యూనియన్ బ్యాంక్ ఆవరణలో హనుమకొండ రాయపురకు చెందిన యంజ్యాల శివ(33)పై ఆయన స్నేహితుడు కర్రతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమకొండ సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. శివకు పదేళ్ల క్రితం వివాహం జరిగి రెండేళ్ల అనంతరం భార్య వదిలి వెళ్లిపోయింది. అప్పుడప్పుడు కూలి పనిచేస్తూ, మిగతా సమయాల్లోరోడ్లపై ఖాళీ డబ్బాలు, ఇనుప సామాన్లు ఏరుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనతో ఉండే భద్రాది కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రాళ్లగర్ప తండాకు చెందిన పాటియా రమేష్‌తో డబ్బు విషయంలో గతంలో గొడవ జరిగింది. సోమవారం రాత్రి కూడా యూనియన్ బ్యాంక్ ఆవరణలో ఇద్దరు గొడవ పడగా, శివ తలపై రమేష్ కర్రతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం ఉదయం సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించగా, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

నీటి కోసం చెరువులో దిగి ఎద్దు మృతి

దుమ్ముగూడెం : మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన సోయం నరసింహారావుకు చెందిన దుక్కిటెద్దు నీటి కోసం చెరువులో దిగి చెత్తలో ఇరుక్కుపోయి మృతి చెందింది. ఈ ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మండల కార్యాలయానికి ఎదురుగా ఉన్న చెరువు పై భాగంలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. చేపలు సైతం మృత్యువాత పడుతున్నాయని, చెరువులో నిండుగా నీరున్నా ఉపయోగకరం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెరువులో చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.